

# సానుభూతి

– డి.వెంకటరావు

"ఏవండీ! బైరాగి బడ్డీ తగలబడిపోతోంది. లేచి ఫైరాఫీసుకి ఫోను చెయ్యండి" గాభరాగా భర్తను కుదిపింది భారతమ్మ.

"అబ్బ... ఎవరి బడ్డీ తగలబడితే మనకేమీ... బంగారం లాంటి నిద్ర చెడగొట్టావ్. వెళ్ళి పడుకో" బద్ధకంగా వళ్ళు విరుస్తూ అటు ఇటు దొర్లి ముసుగు తన్నాడు మురారి.

"మంటలు మనింటి మీదకు వ్యాపిస్తున్నాయండీ.. కొంప తగలబడిపోతుందేమో నని భయంగా వుంది. లేవండీ"– స్వరం రెట్టించింది భారతమ్మ.

ఇంట్లో ఫోనుంటే తనే ఫైరాఫీసుకి ఫోన్ చేసి ఉండేది. ఆ సదుపాయం లేనందునే భర్తను లేపింది.

మరింత ముడుచుకుపోయాడు మురారి.

"హు... మొద్దు నిద్ర. ఆ కుంభకర్ణుడ్నయినా

లేపొచ్చేమో గానీ ఇతన్ని లేపడం ఆ బ్రహ్మతరం కాదు" అనుకొని గబగబా వీధి గుమ్మంలోకొచ్చి కేకలు పెట్టింది.

ఆమె అరుపులకు ఇరుగుపొరుగు వాళ్ళొచ్చారు. అప్పటికే బడ్డీ సగానికి పైగా తగలబడిపోయింది.

తలొకరు తలో బిందెడు నీళ్ళు పట్టుకొచ్చి బడ్డీ మీద గుమ్మరించారు. అయినా మంటలు అదుపులోకి రాలేదు.

భారతమ్మ అనుకున్నట్లే తన ఇంటి చూరుకు కూడా నిప్పంటుకుంది.

ఏం చేయాలో పాలుపోలేదామెకు. గబగబా వెళ్ళి భర్త రెక్క పుచ్చుకుని బలంగా లాగింది. బద్ధకంగా లేచాడు మురారి. కళ్ళు నులుము కుంటూ వీధి గుమ్మంలోకొచ్చి చూశాడు.

కబురందిందేమో పరుగున వచ్చాడు బైరాగి. గుండెలు బాదుకుంటూ కాలిపోతున్న బడ్డీ వైపు పరుగెత్తాడు. జనం అతడిని పట్టుకుని వెనక్కి లాగుతున్నారు.

ఎవరో ఫోను చేసినట్లుంది. గణగణమంటూ గంటల లారీ వచ్చింది.

ఫైరాఫీసు వాళ్ళు రంగంలోకి దూకారు.

మంటలు చల్లారాయి.

బడ్డీ బూడిదయింది.

మురారి ఇల్లు పాక్షికంగా కాలింది. సమయానికి అగ్నిమాపకదళం వచ్చి ఉండకపోతే అతడి కొంప పూర్తిగా నాశనమయ్యేది. ఫైరాఫీసుకి ఫోను చేసిన వాళ్ళకు కోటి దండాలు పెట్టాడు మురారి.

ఆకాశం తెల్లబడింది.

పక్షులు రెక్కలు టపటపలాడిస్తూ చెట్లమీంచి బయటపడుతున్నాయి.

కాలిపోయిన బడ్డీవద్ద కూర్చుని పెడబొబ్బలు పెడుతున్నారు బైరాగి దంపతులు. వారికి ఆ బడ్డీయే జీవనాధారం. అక్కడ చేరిన వాళ్ళు ఎవరికి తోచిన మాట వారు చెబుతూ వాళ్ళని ఓదారుస్తున్నారు.

మురారి కూడా అంతో ఇంతో నష్టానికి గురైనా అతడినెవరూ పట్టించుకోవడం లేదు. సానుభూతి కనపరచడంలేదు.

# అనాథల బతుకులు

డా॥ వాసా ప్రభావతి

జనం బద్ధకంగా దుప్పటి ముసుగులో
ఒళ్ళు విరుచుకునేవేళ
దూరంగా అందని ఓ అస్పష్ట
వెలుగురేఖ తొంగి చూసేవేళ
బీడు పడిన పొలమై
బీటలు వారిన పాదాలతో
కురుచలైన భవిష్యత్తు బతుకుతో
చెత్తకుండీల చుట్టూ తిరిగె చిగురించని బాల్యపు
బతుకులు
అమ్మ ఒడిలోని మాధుర్యం
నాన్న పిలుపులోని తీయదనం
జనాదరణ తెలియని
అనాథ బతుకులు
చెట్టు పై కళ్ళు తెరిచిన
ఓ వంటరి కాకి 'కావు' మంటూ
జాలిగా పలకరింపు
ఆకుల చివురుల నుండి
మంచు బిందువుల్లా
బొట్లు బొట్లుగా జారుతున్న బాల్యాన్ని
చెత్తకుండీల్లో వెతుకుతున్న పసిచేతులు
ఉదయ రంగంలో విచ్చే పూలగుత్తుల చుట్టూ
పరిభ్రమించే భ్రమరనాదాలు వినిపించని
పనికిరాని ప్లాస్టిక్ సంచుల రొదలు
దుమ్ము ధూళితో అట్టకట్టిన శరీరాలకు
అంటుకుపోయిన మాసిన బట్ట పీలికలు
గుప్పెడు మెతుకుల కోసం
కాల్చి పారేసిన బీడీముక్కల కోసం
తాకట్టు పెట్టుకున్న అనాథ బతుకులు
దుర్గంధాలె మంచిగంధమై
తలపించె బతుకులు
రోజూ లోకానికి ఓ ఉదయం ఉన్నా!
ఏ ఉదయం లేని
ఆ అనాథ పసి బతుకులు.

ఔను. తనమీద వాళ్ళకు సానుభూతి ఎందుకుంటుంది? అతడికీ, తనకీ తేడా లేదూ? తను బైరాగంత పేదవాడేం కాదు. సంభవించిన నష్టాన్ని మళ్ళీ పెంకులేసుకుని పూడ్చుకోగలడు. ఆ క్షణం బైరాగి స్థితిని చూస్తే మురారికి కూడా జాలేసింది. అంతలోనే తగిన శాస్తి జరిగిందం టోందతడి అంతరాత్మ.

ఆరు నెలల క్రితం...

ఉన్న పళంగా తన ఇంటి దగ్గర వెలసిన బైరాగి బడ్డీ చూసి ఉగ్రుడయ్యాడు మురారి. తనతో ఒక్క ముక్కయినా చెప్పకుండా బడ్డీ పెట్టినందుకు అతడి మీద విరుచుకుపడ్డాడు. వెంటనే దానిని అక్కడి నుంచి తొలగించమని హెచ్చరించాడు. నిజానికి బైరాగి బడ్డీ మురారి ఇంటికి ఏ విధం గానూ అడ్డు కాదు. బైరాగి ఎంత ప్రాధేయపడ్డా వినకుండా బడ్డీ తీయవలసిందేనని పట్టుబట్టాడు. వినకపోవడంతో ఊరి పెద్దలతో మొర పెట్టుకున్నాడు.

"బైరాగి బీదవాడే కాదు. మంచివాడు. పైగా నీకు సహాయకారిగా ఉంటాడు. ఏదో బ్రతుకు తెరువు కోసం నలుగురు మనుషులు సంచరించే స్థలం కదా అని ఇక్కడ బడ్డీ పెట్టుకున్నాడు. అది నీకు అడ్డేమీ కాదు. వాడిని కూడ బతకనీయి" అంటూ క్లాసు తీసుకున్నారు. అతడి మెదడు తినేశారు.

వళ్ళు మండిపోయింది మురారికి. అంతా అతగాడి పట్ల సానుభూతి చూపేవారే. ఇలా కాదని మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో పిచ్చెక్కిపోయాడు. బైరాగి దృష్టిలో తను పూర్తిగా చులకనైపోయాడన్న భావన కలిగింది. దాంతో పగబట్టిన పామ య్యాడు. ప్రతీకారం వాంఛిస్తోందతడి మనసు. ఎలాగో కొన్నాళ్ళు ఓపిక పట్టాడు. ఇహ లాభం లేదనుకుని ఓరోజు రాత్రి అంతా ఆదమరచి నిద్రపోతున్న సమయంలో ఎవరూ చూడకుండా బడ్డీకి నిప్పుపెట్టి నంగనాచిలా లోపలకొచ్చి పడుకున్నాడు.

మెలమెల్లగా నిప్పు రాజుకోవడంతో బడ్డీ మండింది. ఆ పని తనే చేశాడని నలుగురికీ తెలిస్తే తనకు దేహశుద్ధి అయ్యేది.

కాస్సేపటికి విలేఖరులొచ్చారు.

ఫొటోలు తీశారు.

తదనంతరం పోలీసులు రంగప్రవేశం చేశారు. ప్రమాదం ఎలా జరిగిందో ఆరాతీయడం మొదలుపెట్టారు.

"నీకెవరిమీదైనా అనుమానం ఉందా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఇదంతా నా ఖర్మ బాబూ. దీనికి నేనెవర్నీ బాధ్యుల్ని చేయలేను. నేనంటే ఈ ప్రాంతంలో అంతా ప్రాణం పెడతారు. నాకెవరూ శత్రువులు లేరు. నాకెవరి మీద అనుమానం లేదు" అన్నాడు బైరాగి.

పోలీసుల ప్రశ్నలకు అతడేం చెబుతాడోనని హడలిపోయిన మురారి 'హమ్మయ్య' అనుకుని ఊపిరి పీల్చుకున్నాడు. నిజానికి అతడేం తెలివితక్కువ వాడేం కాదు. తనమీద ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మూడు నెలల ముందు నుంచి బైరాగితో దోస్తీగా ఉండటం, రోజూ వాడి కొట్లోనే కిళ్ళీలు, సిగరెట్లు కొను క్కోవడం మొదలుపెట్టాడు. అతడి పట్ల విపరీత మైన ప్రేమ నటించాడు. తర్వాత ఇలా అక్కసు తీర్చుకున్నాడు. ఇప్పుడు అతడి కడుపుమంట చల్లారింది.

"వెధవ.. చెబితే విన్నాడు కాదు. ఇహ జన్మలో బడ్డీ చేయించుకోలేడు" అనుకుని తృప్తిపడ్డాడు.

మరునాడే కాలిపోయిన తన ఇంటి భాగాన్ని మరమ్మత్తు చేయించుకోవడం కోసం లోన్‌కి అప్లయి చేశాడు. దరఖాస్తు చేసి రెండు నెలలైనా లోన్ శాంక్షను కాలేదు.

ఈ లోపలే అదే స్థలంలో బైరాగి కొత్త కిళ్ళీ బడ్డీ మామిడి తోరణాలతో కళకళలాడుతూ కనిపించింది. మిస్టరీలా ఫీలయ్యాడు మురారి. ఉన్నట్లుండి అతడికి అంత డబ్బు ఎక్కడ నుండి వచ్చిందో అనుకున్నాడు.

"బైరాగి బలహీన వర్గాలకు చెందినవాడు కదా! అందుకే ప్రభుత్వం అతడికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించింది. ఆ డబ్బుతోనే బైరాగి కొత్త బడ్డీ చేయించుకున్నాడు" అతడి అనుమానాన్ని నివృత్తి చేస్తున్నట్లు అన్నారెవరో.